క్లుప్తంగా

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహించాలి

తుని: ప్రభుత్వం ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.రాము కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా 6100 కానిస్టేబుల్, 411 ఎస్సై పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి, ఈ ఏడాది జనవరిలో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిందన్నారు. మార్చిలో ఫిజికల్ ఈవెంట్ నిర్వహించాల్సి ఉన్నా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో నిలిపివేశారన్నారు. ఆరు నెలలు అవుతున్నా అటు ప్రభుత్వం ఇటు పోలీసు అధికారులు స్పందించలేదన్నారు. యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని తక్షణమే ఫిజికల్ ఈవెంట్ తేదీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఇండియన్ క్రిస్టియన్ డే



సభ్యులకు ఫెలోషిప్ వెల్ఫేర్ సర్టిఫికెట్ అందజేస్తున్న కో ఆప్షన్ సభ్యుడు ఏసుబాబు

తుని రూరల్: పాస్టర్స్ ఫెలోషిప్ తుని టౌన్, మండల శాఖల ఆధ్వర్యంలో సోమవారం ఇండియన్ క్రిస్టియన్ డే నిర్వహించారు. రేఖవాని పాలెంలోని ఫెయిత్ చర్చిలో సంఘ గౌరవాధ్యక్షుడు కె.ఫిలిప్, సీహెచ్ లిమ్మా, అధ్యక్షుడు డి.జాన్ డేవిడ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ క్రిస్టియన్ డేను ఉత్సాహంగా జరుపుకున్నారు. అనంతరం నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ కో ఆప్షన్ సభ్యులు వడ్డాది ఏసుబాబు సంఘ సభ్యులకు ఫెలోషిప్ వెల్ఫేర్ సర్టిఫికెట్లను అందజేశారు. పాస్టర్లు, ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో అంగన్‌వాడీల నిరవధిక నిరసనలు

తుని రూరల్: అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10, 11 తేదీల్లో నిరవధిక ఆందోళనలు చేస్తున్నట్టు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సోమవారం తెలిపారు. ఈ మేరకు సీడీపీఓ శ్రీలతకు వినతి పత్రం అందించినట్టు చెప్పారు. 13 ప్రధాన డిమాండ్ల సాధనకు కలెక్టరేట్ వద్ద ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.సమాదానం, ఎ.రమణమ్మ, లోవరత్నం, ఇందిరా, శాంతికుమారి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కుండపోత వాన

తొండంగి: మండల వ్యాప్తంగా సోమవారం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల ప్రభావానికి పలు చోట్ల విద్యుత్‌వైర్లు తెగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించారు. కాగా వర్షానికి వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేదతీరారు.

జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద కార్మికుల ఆందోళన

ఏలేశ్వరం: చిన్నింపేటలోని జీడి పిక్కల (ఫ్యాక్టరీ ఇంటర్ స్నాక్ క్యాజు ఫ్యాక్టరీ) వద్ద సోమవారం కార్మికులు ఆందోళన చేశారు. ఫ్యాక్టరీలో యాంత్రీకరణను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులను తొలగించి యంత్రాలను వినియోగంలోకి తీసుకురావడం తగదన్నారు. యాజమాన్యం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, యాంత్రీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎ.వీరబాబు, కనకదుర్గారావు, చక్రధర్, వీరబాబు, వరలక్ష్మి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు: సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు సూచించారు. స్థానిక లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాలులో సోమవారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ కిషోర్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం బాలల నుంచి వృద్ధుల వరకూ అందరూ సెల్ ఫోన్లు వినియోగిస్తున్నారని, వాటిలో వచ్చే తప్పుడు సమాచారాలకు స్పందించవద్దన్నారు. ఆన్ లైన్‌లో జరుగుతున్న మోసాలు, సైబర్ నేరాలను వివరించారు. ఎస్సై ఎం.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో టీడీపీ బస్సు యాత్ర

ప్రత్తిపాడు రూరల్: వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా భవిష్యత్‌కు గ్యారంటీ చైతన్య బస్సు యాత్రను చేపట్టినట్టు ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ అన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న భవిష్యత్‌కు గ్యాంటీ చైతన్య బస్సు యాత్ర ఏలేశ్వరం మండలం యర్రవరం వద్ద జగ్గంపేట నియోజకవర్గం నుంచి ప్రత్తిపాడు నియోజకవర్గంలోకి అడుగుపెట్టింది. నియోజకవర్గంలో వరుపుల సత్యప్రభ బస్సు యాత్రను ప్రారంభించారు. ఏలేశ్వరం మండలం యర్రవరం, సిరిపురం, ప్రత్తిపాడు మండలం ఏలూరు, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ, ఉత్తరకంచి, ఒమ్మంగి గ్రామాల్లో బస్సు యాత్ర సాగింది.

బడి బస్సు.. పక్కా ఫిట్‌నెస్

- స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి
- కత్తిపూడి ఆర్టీఓ ఆఫీసు పరిధిలో 220 బస్సులు
- నిబంధనలకు విరుద్ధంగా నడిపితే సీజ్



స్కూల్ బస్సు ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తున్న కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

తొండంగి: ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌కు సంబంధించి ప్రభుత్వం రవాణాశాఖ ద్వారా కచ్చితమైన నిబంధనలు అమలు చేస్తోంది. గతంలో ఫిట్‌నెస్ లేని బస్సుల కారణంగా ప్రమాదాలు జరిగేవి. విద్యారంగంపై ప్రభుత్వం మరింత దృష్టిసారించిన నేపథ్యంలో ప్రైవేటు బస్సుల ఫిట్‌నెస్‌పై రవాణాశాఖకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న బస్సులకు ఫిట్‌నెస్ నిరాకరిస్తున్నామని కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు.

220 బస్సులు

జిల్లా వ్యాప్తంగా కాకినాడ, పెద్దాపురం, కత్తిపూడి ఆర్టీవో కార్యాలయాల పరిధిలో మొత్తం 1301 స్కూల్ బస్సులు ఉన్నాయి. కత్తిపూడి రవాణాశాఖ పరిధిలో తుని, ప్రత్తిపాడు, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని వివిధ ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన 220 బస్సులు ఉన్నాయి. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో గత కొద్ది రోజుల నుంచి ఇప్పటి వరకూ 185 బస్సులకు ఫిట్‌నెస్ చెక్ చేశారు. వీటిలో 15 బస్సులకు జీవిత కాలం ముగియడంతో స్క్రాప్‌కు పంపించారు. మరి కొన్ని బస్సులకు రిపేర్లు, ఐదు బస్సులకు స్టాపేజ్‌లో ఉన్నాయి. ఏపీ మోటార్ వేహికల్ చట్టం 1989 ప్రకారం బస్సుల ఫిట్‌నెట్‌కు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని కత్తిపూడి మోటార్ వేహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ తెలిపారు.

నిబంధనలు ఇలా...

- బస్సుల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే మంటలను ఆర్పేందుకు ఫైర్ ఎక్సెండ్యూసర్ కచ్చితంగా ఉండాలి.
- రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాథమిక చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉండాలి.
- బస్సు వెనుక, ముందు భాగాల్లో ఇది బడి బస్సు, ఇందులో పిల్లలు ప్రయాణిస్తున్నారని రాయించాలి.
- బస్సు నిలిపివేసి ఉన్నప్పుడు పల్లపు ప్రాంతాల్లోకి కదిలిపోకుండా చక్రాలను పట్టి ఉంచే హ్యాండ్ బ్రేక్ వర్కింగ్‌లో ఉండాలి.
- స్కూల్ బస్సులో విద్యార్థులు కూర్చునే సీటు కింద బ్యాగ్‌లను సులభంగా పెట్టి తీసుకునే విధంగా బ్యాగ్ ర్యాక్స్ ఉండాలి.
- స్కూల్ బస్సు డ్రైవింగ్ చేసే వ్యక్తికి 5 ఏళ్ల అనుభవం ఉండాలి. ఆ వ్యక్తి వయసు 60 ఏళ్ల దాటకూడదు. బస్సులో పిల్లలను ఎక్కించి, దించేందుకు అటెండర్ తప్పని సరిగా ఉండాలి.

బస్సులు కుడివైపు, ఎడమ వైపు మలుపులు తిరిగేప్పుడు సిగ్నల్ బ్లింకర్స్ పనిచేయాలి.

- బస్సులో విద్యార్థులు చేతులు, తల బయటపెట్టకుండా కిటికిలకు మూడు వరసల గ్రిల్ ఉండాలి.
- స్కూల్ బస్సు 60 కిలో మీటర్లకు మించి స్పీడ్ వెళ్లరాదు. ఫిట్ నెస్ సమయంలో తనిఖీ చేసి అధిక స్పీడ్ వెళ్తే బస్సు ఇంజిన్‌లో స్పీడ్ లాక్ చేస్తారు.

ఫిట్‌నెస్ లేకుంటే సీజ్ చేస్తాం



రవాణాశాఖ మార్గదర్శకాల ప్రకారం ఆరు మండలాల పరిధిలో 185 బస్సులను స్వయంగా పరిశీలించి నిబంధనల ప్రకారం ఫిట్‌నెస్ ఇచ్చాం. స్కూల్ బస్సుల ఫిట్‌నెట్‌కు సంబంధించి క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తాం. అనుమతులు లేకుండా బస్సులు నడిపితే వాటిని సీజ్ చేస్తాం. సంబంధిత కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటాం.

–బి.శ్రీనివాస్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, కత్తిపూడి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- లింగంపర్తిలో గడపగడపకూ మనప్రభుత్వం



లింగంపర్తిలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని లింగంపర్తిలో సోమవారం ఆయన గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీనాయకులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇప్పటికే 99 శాతం అమలు చేశారన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిక్కాల లక్ష్మణరావు, అడపా పార్థసారధి, యార్లగడ్డ రాజాచౌదరి, వడ్డి శ్రీవాస్తవ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన

జగ్గంపేట: భూకబ్జాదారులకు కొమ్ముకాస్తున్న స్థానిక తహసీల్దార్ శ్రీదేవిపై చర్యలు తీసుకోవాలని రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు కూలీసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో 10 ఎకరాల సీలింగ్ భూమిని 20 ఏళ్లుగా ఎస్సీ, బీసీ కులాలకు చెందిన పేదలు సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూమిలో 4 ఎకరాలకు గతంలో కొందరు తప్పుడు రికార్డులు సృష్టించి ఆక్రమించారన్నారు. ఇప్పుడు మిగిలిన భూమిని కూడా కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనికి తహసీల్దార్ శ్రీదేవి సహకరిస్తున్నారిని ఆరోపించారు. ఈ భూమి వద్ద ఏర్పాటు చేసిన బోర్డులు తొలగించాలని డిమాండ్ చేశారు.

ఆ ఆరోపణల్లో నిజం లేదు

తనపై రైతు కూలీ సంఘం చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. గుర్రంపాలెంలోని సీలింగ్ భూమిని ఎవరు సాగుచేసుకోవటం లేదని తమ విచారణలో తేలిందన్నారు. ప్రభుత్వ పేదలకు పట్టాలు ఇస్తున్న నేపథ్యంలో గ్రామసభలు పెట్టి అర్హులను గుర్తించి పట్టాలు ఇస్తామని తెలిపారు.

దళితులకు పెద్దపీట



మాట్లాడుతున్న ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం దళితులకు పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన దళిత నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. దళితులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎటువంటి మేలు జరగడం లేదన్న టీడీపీ నేతల ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. గోకవరంలో దళితుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. దళితుల శ్మశానవాటికలో సీసీ రోడ్డు నిర్మించారని, ప్రస్తుతం దీనిచుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. టీడీపీ నేతల ప్రోద్బలంతోనే గోకవరంలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు కాకుండా నిలిచిపోయాయని ఆరోపించారు. జగ్గంపేటలో ఎకరం స్థలంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శంకుస్థాపన చేశారని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, బిజ్జి రాజు, మచ్చా మోహన్, బొడ్డపాటి వీరచంద్రం, బూలా అబ్బులు, కొల్లపు అర్జున్‌రావు, మందపాటి సతీష్, అంబటి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఎన్‌రోల్‌మెంట్ ఫీజు తగ్గించాలి

ప్రత్తిపాడు: కొత్తగా న్యాయవాద వృత్తిలోకి వచ్చే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎన్‌రోల్‌మెంట్ ఫీజు రూ.750గా నిర్ణయించాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రాష్ట్ర అడ్‌హక్ కమిటీ కన్వీనర్ బుగత శివ కోరారు. ఈ మేరకు ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు సోమవారం వచ్చిన రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది కీర్తి రామ జోగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుగత శివ మాట్లాడుతూ కొత్తగా న్యాయవాద వృత్తిలోకి అడుగు పెట్టే వారికి ఎన్‌రోల్‌మెంట్ ఫీజు రూ.12 వేల వరకూ వసూలు చేయడం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ఫీజుల విధానం దేశ వ్యాప్తంగా ఒకేవిధంగా లేదన్నారు. ఎన్‌రోల్‌మెంట్ ఫీజు దేశవ్యాప్తంగా రూ. 750 ఉండేలా బార్ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరారు. బార్ కౌన్సిల్‌లో చర్చించి, తగిన నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కీర్తి రామ జోగేశ్వరరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐలాజ్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు అవసరాల దేవి, ప్రత్తిపాడు బార్ సభ్యులు రాజాల చిట్టిబాబు, బండారు నరసింహారావు, ఆకాశపు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

శాకంబరిగా వరమహాలక్ష్మి అమ్మవారు





శాకంబరి అలంకరణలో తుని వరమహాలక్ష్మి, అన్నవరం నేరేళ్లమ్మ అమ్మవార్లు

తుని: స్థానిక చిట్టూరి మెట్రోలో వేంచేసిన వరమహాలక్ష్మి అమ్మవారు సోమవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసోత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. తుని, పాయకరావుపేటకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శాకంబరిగా నేరేళ్లమ్మ అమ్మవారు

తొండంగి: గోపాలపట్నంలోని నేరేళ్లమ్మ అమ్మవారు సోమవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శాకంబరిగా నేరేళ్లమ్మ, మరిడమ్మ అమ్మవార్లు

అన్నవరం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం అన్నవరం గ్రామ దేవతలు నేరేళ్లమ్మ, మరిడమ్మ అమ్మవార్లు శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించారు. అలాగే స్థానిక తారక రామా కాలనీలోని నూకాలమ్మ అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

గోకవరం: నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక రమాసత్యనారాయణస్వామి ఆలయంలో వ్యాసుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక గీతామందిరంలో సతానతనధర్మ ప్రబోధనా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు ఆధ్వర్యంలో వ్యాసమహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ప్రత్తిపాడు: స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి పంచాయతన క్షేత్రం, తోట వీధిలోని షిర్డీసాయి మందిరంలో బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శివాలయం వద్ద గల సాయిబాబా ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

తుని రూరల్: గురు పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వ్యాసపూజ, చాతుర్మాస సంకల్పం నిర్వహించారు. శ్రీకృష్ణ పంచకం, వ్యాస పంచకం, శంఖర పంచకం, సనక పంచకం పూజలు చేశారు. డి.పోలవరం సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు, గిరిప్రదక్షిణ, భారీ అన్నసమారాధన నిర్వహించారు. లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి మహా చండీ హోమాన్ని నిర్వహించారు.

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, గో పూజ, శ్రీగురుపాదుకా పూజలు నిర్వహించారు.

శంఖవరం: గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కత్తిపూడి, శంఖవరం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నసమారాధనలు నిర్వహించారు.

లబ్ధిదారులకు రక్ష.. జగనన్న సురక్ష

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గ్రామాల్లో జోరుగా జగనన్న సురక్ష



గిడజాంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



బూరుగుపూడిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు జగనన్న సురక్ష కార్యక్రమం రక్షణగా నిలుస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. బూరుగుపూడి సచివాలయం–1లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి ఏ కారణం చేతనైనా అందకపోతే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వారిని గుర్తించి పథకాలు అందిస్తామన్నారు. ఎంపీపీ తోట రవి, వైఎస్సార్ సీపీ నాయకులు పాతంశెట్టి కృష్ణ మూర్తి, కర్రి నారాయణమూర్తి, చదలవాడ బాబీ, దోమాల గంగాధర్, తోట గాంధీ, తోట విష్ణు, భూపాలపట్నం ప్రసాద్, జనపరెడ్డి బాబు, అత్తులూరి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సూచించారు. జె.కొత్తూరు గ్రామ సచివాలయంలో సోమవారం సర్పంచి నకిరెడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ కారణం చేతనైనా అందకపోతే అర్హులైన వారిని గుర్తించి ఈ కార్యక్రమం ద్వారా పథకాలు అందిస్తామన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు లబ్ధిదారులను దోచుకున్నాయన్నారు. ప్రస్తుతం గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటికే పథకాలు అందుతున్నాయని తెలిపారు. జగనన్న సర్రక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజబాబు, ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ కె.సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్ చిండనీడి కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని గిడజాంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని లబ్ధిదారులకు మంజూరైన వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రామాల్లో 80 శాతానికిపైగా ప్రజలకు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిచేకూరిందన్నారు. మిగిలిన వారికి ఏ కారణం చేతనైనా పథకాలు అందకపోతే సురక్ష ద్వారా వారిని గుర్తించి పథకాలు అందజేస్తామన్నారు. తహసీల్దార్ బి.భీమారావు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, సర్పంచ్ నిమ్మగడ్డ పరంజ్యోతి పాల్గొన్నారు.

పేరవరంలో జగనన్న సురక్ష

ఏలేశ్వరం: మండలంలోని పేరవరంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి వరప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న సురక్ష ద్వారా లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. గ్రామాల్లో నెలరోజుల పాటు నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, తహసీల్దార్ చిన్నారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

తుని: ప్రజలకు ఏమి అవసరమో ముందుగానే తెసుకుని వాటిని అందించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి చెప్పారు. స్థానిక టైలర్స్ కాలనీలోని సచివాలయంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చింతల సునీత అధ్యక్షతన జరిగిన సభలో చైర్‌పర్సన్ సుధారాణి మాట్లాడారు. సీఎం జగన్ నాలుగేళ్లలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించారన్నారు. ఇప్పుడు వ్యక్తిగత అవసరాలకు సంబంధించిన అన్ని రకాల సర్టిఫికెట్లను నేరుగా ప్రజల చెంతకు చేరవేస్తున్నారని తెలిపారు. లబ్ధిదారుల నుంచి 386 దరఖాస్తులు రాగా 371 సమస్యలను పరిష్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్ వారాధి జ్యోతి, కో ఆప్షన్ సభ్యుడు జాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బురదకోటలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు తహసీల్దార్ వీవీవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతల రాజు, గ్రామ సర్పంచ్ చింతల చిన్నాలమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రత్యంగిర, చండీ హోమాలు



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: ఆషాఢ పూర్ణిమ సందర్భంగా రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి సోమవారం ప్రత్యంగిర హోమం, కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం మూల సందర్భంగా కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి హోమాలు ప్రారంభించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రత్యంగిర హోమంలో దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ దంపతులతో సహా 45 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రత్యక్షంగానూ, మరో ఐదుగురు రూ.1,116 చొప్పున ఆన్‌లైన్‌లో టిక్కెట్లు కొనుగోలు చేసి పరోక్షంగానూ పాల్గొన్నారు. కనకదుర్గ అమ్మవారికి నిర్వహించిన చండీ హోమంలో ముగ్గురు భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి పాల్గొన్నారు.

కాకినాడ వెళ్లి పింఛను అందజేత



కాకినాడలో పద్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ కల్యాణ్

అన్నవరం: గ్రామానికి చెందిన కొండ్రు పద్మ అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఆమె పింఛను లబ్ధిదారు కావడంతో గ్రామ వలంటీర్ పలివెల కల్యాణ్ సోమవారం తన సొంత ఖర్చులతో కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పద్మకు పింఛను అందజేశారు. వలంటీర్ కల్యాణ్‌ను గ్రామ సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, అధికారులు అభినందించారు.

మురారిలో సినిమా షూటింగ్

గండేపల్లి: మండలంలోని మురారిలో సోమవారం సినీ సందడి నెలకొంది. గ్రామానికి చెందిన ఉప్పలపాటి గంగాధర్ ఇంట్లో తండ్రి, కూతురు మధ్య ఓ సన్నివేశం చిత్రీకరించినట్టు డైరెక్టర్ వీవీఎస్ సుబ్రహ్మణ్యం (నాని) తెలిపారు. జంగారెడ్డిగూడేనికి చెందిన నాని నవ్వులే నవ్వులు, వదలడు సినిమాలకు దర్శకత్వం వహించారు. ప్రస్తుతం డీబీఎస్ (దొరబాబునాయుడు) ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌లో మూడో సినిమా చేస్తున్నానని, ఇప్పటికే 35 శాతం షూటింగ్ పూర్తయిందని డెరెక్టర్ నాని తెలిపారు. రాజానగరం, తదితర చోట్ల ఈ నెల 20 వరకు షూటింగ్ చేస్తామని చెప్పారు. ఈ సినిమాలో హీరోగా పవన్, హీరోయిన్‌గా ప్రియ, నటులు సుధ, సూర్య, సుమన్ విలన్‌గా ఆనంద్ నటిస్తున్నట్టు చెప్పారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

తుని: భవన నిర్మాణం, ఇతర రంగాలకు చెందిన కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని సీఐటీయూ నాయకులు పద్మ, ఎస్.శ్రీనివాస్ కోరారు. స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బిల్డింగ్ వర్కర్స్ వేల్ఫేర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలను నిలిపివేస్తూ ఇచ్చిన జీవో 1214ను రద్దు చేసి యథావిధిగా పథకాలు అమలు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల తరపున రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాను కలిసి సమస్యను వివరించామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. సీఐటీయూ నాయకులు ధనలక్ష్మి, సుబ్బులక్ష్మి, వెంకటరమణ, నాగేశ్వరరావు, గణేష్, రమణ పాల్గొన్నారు.

కోడి వ్యర్థాలు తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కిర్లంపూడి: కోడి వ్యర్థాలు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు స్థానిక ఏఎస్సై రామకృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. వీరవరంలోని చేపల చెరువులకు వైజాగ్ నుంచి బొలేరో వ్యాన్‌లో కోడి వ్యర్థాలు తీసుకు వస్తున్నట్టు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు రెవెన్యూ, ఫిషరీస్ సిబ్బంది కలిసి పోలీసులు దాడి చేశారు. వ్యర్థాలు కలిగిఉన్న వ్యాన్‌ను సీజ్ చేశారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఎ. మల్లవరం గ్రామ వాసి సతీష్, కైకలూరుకు చెందిన పరశురామ్‌లను అరెస్ట్ చేశారు. ఫిషరీస్ ఏఎఫ్ రాజేంద్ర, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.